# ఆటబొమ్మ కాదు ఆడది



కందుకూరి వెంకటమహాలక్ష్మి

నాగేంద్ర మనసు తుఫాను గాలి కంటే వేగంగా పరుగులు తీస్తోంది. చేసిన పనే మళ్ళీ చేస్తున్నాడు. సర్దిన సామానే మళ్ళీ సర్దుతున్నాడు. సరిగ్గా వుందో లేదో అని మళ్ళీ మళ్ళీ చూస్తున్నాడు. గదిలో తుక్కు, సామాన్లా కనపడ్డదల్లా గది వెనకకి తోస్తున్నాడు. మంచం మీద తెల్ల దుప్పటి పరిచాడు. పరుపంతా మల్లెపూలు జల్లాడు. కూల్ డ్రింక్‌లు తెచ్చి ఫ్రిజ్‌లో పెట్టాడు. స్వీట్లు, మిక్స్‌చర్ తెచ్చి బల్ల మీద పెట్టాడు. స్నానం చేసి తెల్ల లాల్చీ, పైజామా వేసుకున్నాడు. అగరొత్తులు వెలిగించి బల్ల మీద పెట్టాడు. బట్టలు నలగకుండా ఒబ్బిడిగా కూర్చుని గడియారం కేసి చూశాడు. ఉమ రాకకి ఇంకా గంట టైముంది. లైబ్రెరీ నుంచి తెచ్చిన నవల తీసి చదవసాగాడు. మామూలుగా అయితే అలాంటి రొమాంటిక్ నవల చదువుతూ అపర మన్మథుడిలా వెర్రెక్కిపోయేవాడే! ఈ రోజు మాత్రం అంతటి పుస్తకం ఉమ తలపుల ముందు బలాదూర్ అయింది. దృష్టి తలుపు మీద, మనసు ఉమ మీద వుండటంతో మాటి మాటికి తలుపుకేసి చూస్తున్నాడు.

నిజానికి ఇంత తొందరగా ఉమ తన కోరికని తీరుస్తుందని అనుకోలేదు. ఎంత 'అదృష్టవంతుడిని' అనుకున్నాడు.

ఉమ ఈ ఆఫీసుకి బదిలీ అయి వచ్చిన దగ్గర్నుంచి మగవాళ్ళందరి కళ్ళూ ఆమె మీదే వున్నాయి. పని వున్నప్పుడు తప్ప మిగతా టైములో అందర్నీ చాలా దూరంగా వుంచే ఉమని పలకరించే ధైర్యం ఎవ్వరికీ వుండేది కాదు. తను కూడా చాలాసార్లు మాట్లాడాలని ప్రయత్నించి విఫలుడయ్యాడు.

లంచ్ టైములో ఉమ వచ్చి "టీ తీసుకుందామా?" అని నాగేంద్రని అడగడం నిజంగా అతనికి మతి పోయింది. మర్నాడు హోటల్‌కి వెళ్ళారు, తరువాత పార్కులకి, సినిమాకి - అలా అలా ఇద్దరి మధ్యా స్నేహం పెరిగిపోసాగింది. అదే అదనుగా చూసి మర్నాడు సాయంత్రం తన గదికి రమ్మని ఆహ్వానించాడు ఉమని. వెంటనే సరే అంది. అంతే - ఆ క్షణం నుంచి నాగేంద్ర మనసు అదుపులో లేదు. గాలిలో ఎగిరే దూది పింజల్లా ఎగిరిపోతోంది. ఆకాశంలో మేఘాలమీద పయనిస్తున్నట్లుంది. మనసులో పుట్టుకొస్తున్న కోరికల్ని అదుపులో వుంచుకోలేకపోతున్నాడు. క్షణమొక యుగంలా గడుస్తోందతనికి. తెల్లారిన దగ్గరి నుంచి అతని హడావుడి ఇంతా - అంతా కాదు. ఆఫీసుకి శలవు పెట్టి మరీ ఆమె రాకకి కావలసిన ఏర్పాట్లు చేస్తున్నాడు.

ఇంతలో తలుపు చిన్నగా తట్టిన శబ్దమయింది. ఊహా లోకాల్నుంచి ఒక్కసారి వెలికివచ్చి "కమిన్" అన్నాడు.

తలుపు తోసుకుని లోపలికొచ్చిన ఉమ రతీ దేవి లా వుంది. తెల్లని మైసూర్ సిల్క్ చీర, తల నిండా పెట్టిన సన్న జాజుల మాల ఆమె వన్నెతో పోటీ పడుతున్నాయి. చిన్నగా నవ్వుతూ లోనికి ప్రవేశించిన ఉమని అమాంతం వాటేసుకోవాలని మనసు ఉరకలేస్తున్నా ఏమూలో దాగివున్న సంస్కారం కాస్తా అడ్డం తగిలి వద్దని ఆపింది.

మాటలు రానివాడిలా ఆమెని చూస్తూ నిలబడిపోయిన నాగేంద్రని చూస్తూ "ఏమిటిలా నిలబడిపోయారు? నన్ను రమ్మన్నది ఇలా తలుపు దగ్గర నిలబెట్టడానికా?" అంది. లక్కల్లాంటి పెదాల

మధ్య ముత్యాలు పరిచినట్లున్న పలువరస, సొట్టలు పడే గులాబీ రంగు బుగ్గలు, పార్వతీ దేవి చేసిన బొమ్మలా వున్న ఆమెని చూస్తూ తనని తాను కంట్రోల్ చేసుకోలేకపోతున్నాడు. సంస్కారం వీపు చరచగా "రా ఉమా! రా!" అన్నాడు సోఫాలో కూర్చున్న ఉమకి ఫ్రిజ్‌లోంచి ఐస్ తీసి గ్లాసుల్లో వేసి కూల్‌డ్రింక్ పోసి యిచ్చాడు.

ఆమె వేళ్ళని తాకేలా ఆమెకి గ్లాసు అందించి, తనో గ్లాసు తీసుకుని ఆమె పక్కనే కూర్చున్నాడు. కొంటెగా నవ్వుతూ డ్రింక్ తాగసాగింది ఉమ. అది అంగీకారంగా తీసుకుని ఎడం చేతిని ఆమె భుజం చుట్టూ వేసాడు. ఓరగా అతన్ని చూసి మళ్ళీ నవ్వింది. అంతదాకా వున్న కంట్రోల్ కాస్తా తప్పి గ్లాసు పక్కన పెట్టి రెండు చేతులతో ఆమెని చుట్టేసాడు.

"అమ్మగారూ! ఎంత ఊరడించినా ఊరుకోటం లేదండీ!" అంటూ తలుపు దబదబా కొట్టిన శబ్దంతో పాటు చంటిపిల్ల ఏడుపు వినపడటంతో ఉలిక్కిపడి దూరంగా జరిగారిద్దరూ. నాగేంద్ర వెళ్ళి తలుపులు తీశాడు. ఎదురుగా నెలల పాప గుక్క తిప్పుకోకుండా ఏడుస్తోంది. ఆ పాప నెత్తుకున్న దాది శతవిధాల ఊరడించడానికి ప్రయత్నిస్తోంది.

'ఆకలేస్తున్నట్లుంది. ఇలా ఇవ్వు పాలు పడతా'నని తీసుకుని నాగేంద్ర పరిచిన పక్క మీద పడుకోబెట్టి పర్సులోంచి పాల బాటిల్ తీసి చంటి పాపకి అందించగానే బుద్ధిగా తాగసాగింది.

"ఈ పిల్ల ఎవరు?" అన్నాడు అయోమయంగా ఉమని, చంటి పిల్లని మార్చి మార్చి చూస్తూ.

"నా కూతురు" అంది ఉమ మామూలుగా అతన్ని చూస్తూ.

"నీకు పెళ్ళి కాలేదు కదా?" అన్నాడు కాస్త స్వరం హెచ్చించి.

"అయితే! పెళ్ళి కాకుండా పిల్లలు పుట్టకూడదా?" అంది అతిసహజంగా.

"అయితే నీ అందం వెనక ఇంత చరిత్ర వుందన్న మాట - ఈ సంగతి ముందే చెప్పలేక పోయావా?" అన్నాడు కోపాన్ని అదుపులో వుంచుకోలేక.

"శీలం లేని మగాడి దగ్గరకొచ్చే ఆడదానికి మాత్రం శీలం వుండాలా?" అంది తాగేసిన పాల సీసాకి మూతపెడుతూ.

"ఏమిటి వాగేవు? నా శీలం గురించి మాట్లాడే హక్కు నీకెవరిచ్చారు? "అన్నాడు అరుస్తున్నట్లే.

"మీరే" అంది చేతి రూమాలుతో ఆ పాప పెదాలు తుడుస్తూ.

"నాకు శీలం లేదని ఎవరన్నారు?" అన్నాడు మీదకొస్తూ.

"మీ నడతే" ' అంది చంటి పిల్లని భుజం మీద వేసుకుంటూ.

"ఏమిటి పేలుతున్నావు?" అన్న మాటలు పూర్తి కాకుండానే -

"నీరజా!" అని పిల్చింది ఉమ.

పని మనిషిని పిలుస్తోందని కాస్త వెనక్కి నడిచి తలుపు వైపు చూసిన నాగేంద్ర కొయ్య బొమ్మలా, లోపలికొచ్చిన స్త్రీనే చూస్తూ నిలబడిపోయాడు. కాస్త తేరుకుని

"నీ-ర-జా! నువ్వా" అన్నాడు వెర్రివాడిలా ఆమెనే చూస్తూ.

"ఏం - మీ బండారం బయటపడిందని కంగారు పడుతున్నారా?" అంది వెటకారంగా నాగేంద్రని చూస్తూ నీరజ.

"నువ్విక్కడికెందుకొచ్చావు?" అన్నాడు కంగారు పడుతూ.

"మీ డ్రామా చూద్దామని" అంది లోపలికొచ్చి సోఫాలో కూర్చుంటూ.

"ఏమండీ! గురువు గారూ!! నీరజకీ ఇదే టైమిచ్చారా? పొరపాటున - " అంది నవ్వుతూ ఉమ.

"అబ్బెబ్బే - ఆవిడెవరో నాకు తెలియదు" అన్నాడు గాభరాపడుతూ.

"తెలీకపోవడమేమిటండీ! పెళ్ళి చేసుకుంటానని తియ్యటి కబుర్లు చెప్పి, మోసం చేసి ఈ పిల్లని కూడా కని, మావాళ్ళతో మాట్లాడి వస్తానని వెళ్ళి తప్పించుకు తిరుగుతూనూ!" అంది నీరజ అతన్ని పరీక్షగా చూస్తూ.

"ఏమిటి? ఈ పాప నీకు పుట్టిందా? మరి ఉమ తన పిల్ల అందేమిటి?" అంటూ ముఖానికి పట్టిన చమట తుడుచుకున్నాడు.

"చూడండి మాష్టారూ! స్త్రీలని మోసగించి, పిల్లల్ని కని వాళ్ళని అనాథల్ని చేసేది మీవంటి మహనీయులే. అయినా - మీ దగ్గరకొచ్చే స్త్రీలు మాత్రం శీలవంతులయి వుండాలని కోరుకునే మీలాంటి శ్రీరామచంద్రమూర్తులకి ఎలాంటి బిరుదులివ్వాలిట??" అంది వెటకారంగా నవ్వుతూ ఉమ.

"నిజంగానే నీరజని పెళ్ళాడదామనుకున్నాను. కానీ మా అమ్మ నాన్నగార్లకి కట్నం, లాంఛనాలూ కావాలి. నీరజ తల్లిదండ్రులు మా వాళ్ళడిగినంత ఇవ్వలేరు. ఆ విషయం చెప్తే మా అమ్మ నూతిలో పురుకుతానంది, మా నాన్న ఉరేసుకుంటానన్నాడు. వాళ్ళని ఎదిరించలేక నీరజను వివాహం చేసుకోలేదు" అన్నాడు.

"ఆహాహా - ఎంత పితృ వాక్య పరిపాలకులండీ! ముందా విషయం తెలీలేదా? మీలాంటి వారుండబట్టే దేశంలో అనాథ బాలలు, వ్యభిచారుల గృహాలు కోకొల్లలుగా వెలుస్తున్నాయి.

"చూడండి అయిం దేదో అయింది ఇక అసలు విషయానికొద్దాం. మీరు మా స్నేహితురాలు నీరజని వివాహం చేసుకుంటారా లేదా? చేసుకోకపోతే కోర్టుకీడ్చి మరీ పెళ్ళి జరిపిస్తాం" అంటూ లేచింది ఉమ.

"ఏ సాక్ష్యం వుందని కోర్టుకీడుస్తారు? మీ నీరజ నాతో తిరిగినట్టే ఎందరితో తిరిగిందో? ఈ పిల్ల ఎవడికి పుట్టిందో? రుజువేమిటి?" అన్నాడు బెదిరింపుగా.

"రుజువా? సాక్ష్యం కావాలా? నువ్వే నీ తప్పుకి సాక్ష్యం! ఇదిగో చూడు పాలసీసా తీస్తూ నా పర్సులో పెట్టిన టేప్ రికార్డర్ ఆన్ చేసాను. నీ తప్పుడు నడతకి నువ్వే సాక్ష్యం!! మర్యాదగా నీరజని పెళ్ళాడి, బుద్ధిగా ఏలుకుంటావో - లేక కోర్టు కెక్కుతావో నిర్ణయించుకుని రేపు ఆఫీసులో చెప్పు. పిచ్చి వేషాలు వేస్తే రేపు ఆఫీసులో కూడా అందరికీ ఈ టేప్ వినిపించి నీ బండారం బయట పెడతాను. నీ బాస్ ఎవడో కాదు మా బాబాయ్ - నీ ఉద్యోగం కూడా ఊడపీకిస్తా జాగ్రత్త" అంటూ నీరజ చెయ్యి పట్టుకుని బయటికి వెళ్తున్న ఉమ కాళ్ళు రెండూ పట్టేసుకుని "ఉమా! ప్లీజ్ - ఆ పని మాత్రం చెయ్యకు, నేను నీరజని రిజిస్టర్డు మేరేజ్ చేసుకుంటాను. పొరపాటయింది." అంటూ బ్రతిమాలుతున్న నాగేంద్రని చూస్తూ "నా కాళ్ళు కాదు పట్టుకోవలసింది, వెళ్ళి నీ పెళ్ళాం కాళ్ళు పట్టుకో" అంటూ చకచకా బైటికొచ్చేస్తూ "ఆడది ఆడబొమ్మ కాదు తెలుసుకో" అన్న ఉమని చూస్తూ తల వంచుకున్నాడు నాగేంద్ర. ❐ ❐

### మహిళా న్యాయవాదులు

న్యాయవాద వృత్తిలో ప్రవేశిస్తామని ముందుకు వచ్చిన రెజినాగుహ, సుధా సుబాలా అనే మహిళలు 1917 లో తీవ్ర వ్యతిరేకాన్ని ఎదుర్కోవలసి రావడంతో వారు వెనక్కి తగ్గవలసి వచ్చింది. కానీ 1923 సం॥ లో కార్నిలియా సోరాబ్జి అనే వనిత న్యాయ వాద వృత్తిలో ప్రవేశిస్తానని పట్టు బట్టడంతో ఎవరూ ఆమెని నిరోధించ లేకపోయారు. అటు పిదప 14 సం॥లకు ట్రావన్‌కోర్ రాజ్య పాలకులు అన్నాచాండీ అనే స్త్రీని న్యాయ నిర్ణయాధికారిగా నియమించారు. ఆమెయే 1959 లో కేరళ రాష్ట్ర హైకోర్ట్ న్యాయ మూర్తిగా నియమితురాలై స్వతంత్ర భారతంలో మొదటి మహిళా జడ్జిగా ఖ్యాతి గడించింది. ఈ నాడు దేశంమొత్తం మీద అన్ని హైకోర్టులలో కలిపి 500 మందికిపైగా జడ్జీలుండగా వారిలో మహిళా న్యాయ మూర్తులు 15 కు మించి లేరు. ఈమధ్యే లీలా సేట్ హిమాచల్ ప్రదేశ్ హైకోర్ట్ ప్రధాన న్యాయమూర్తిగా నియమితురాలైన సంగతి అందరికీ తెలిసిందే. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన 42 సం॥లకు ఫాతిమా బిబి అనే మహిళను సుప్రీం కోర్ట్ న్యాయ మూర్తిగా నియమించారు. ఆంధ్రప్రదేశ్‌లో మొదటి మహిళా న్యాయవాది స్వర్గీయ జస్టిస్ సీతామహాలక్ష్మిగారు. జస్టిస్ అమరేశ్వరి గారు హైకోర్ట్ న్యాయమూర్తిగా రిటైరయ్యారు. ఆంధ్ర ప్రదేశ్ హైకోర్ట్‌లో 24 మంది న్యాయమూర్తులుండగా, వారిలో జస్టిస్ సూత్రాల విజయ మారుతి గారు ఒక్కరే మహిళ. ప్రాక్టీస్ చేస్తున్న మహిళాన్యాయవాదులు 15కు మించి లేరందులో!

భోశ్రీ